### గతంలో దొరల ప్రభుత్వం కాదు...

# పేదోడి ప్రజా ప్రభుత్వం

ఎన్నినో ప్రభావం ఉన్నప్పటికీ... కరెంట్ కష్టాలు రానీవ్వం

మెదటి విడతలో 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేశాం.

రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి.




జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

ఆదివారం 4 అక్టోబర్ 2026 పేజీలు : 8


### ఆధ్యాత్మిక వైభవానికి అల్లీపురం వేదికగా

# శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- 20 ఎకరాల్లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం
- ఈ నెల 12న అంగరంగ వైభవంగా భూమి పూజ
- అమరావతిలోని ఆలయ నమూనాలో ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మాణం
- ఖమ్మం ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి ఆలయ నిర్మాణాలు దోహదం
- భూమిపూజ కార్యక్రమానికి భక్తులు, అన్ని సంఘాలు పెద్ద ఎత్తున తరలిరావాలి



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

ఖమ్మం నగరంలో ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేలా అల్లీపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు - మిగతా3లో



### ఇంగ్లీష్ క్లాసులంటే...

# కేవీ నారాయణే

టీచర్ల నుంచి సాఫ్ట్వేర్ ల వరకు... కె.వి క్లాసులకే డిమాండ్

క్లాస్ మొదలైతే... ఇంగ్లీషులో దూసుకెళ్లాల్సిందే!

తక్కువ మందితో బ్యాచ్లు.. ఎక్కువ శ్రద్ధతో శిక్షణ..

నామమాత్రపు ఫీజులతో పేద విద్యార్థులకు శిక్షణ

ప్రకటనలు ప్రచారం లేకుండానే కేవీ నారాయణ క్లాసులకు డిమాండ్

ఆంగ్లం మాట్లాడేలా ప్రోత్సహించడం ఆయన లక్ష్యం

విద్యార్థుల నుండి ఉద్యోగుల వరకు ఆయన క్లాసులకు హాజరు

అదే కే.వి నారాయణ ప్రత్యేకత

3

### గిరిజన గ్రామీణ ప్రజలకు భరోసానిచ్చే క్యాన్సర్ ఆసుపత్రి

# ఏర్పాటు అభినందనీయం



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నారాయణపురం గ్రామంలో షిరిడీ సాయి జనమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆసుపత్రి నిర్మాణం

రూ. 200 కోట్లకు పైగా నిధులతో క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్, ఉచిత సహాయక కార్యక్రమాలు

# పాలనలో సమన్వయ లోపం

ఆర్థిక విషయంలో మంత్రులకు లేని స్వేచ్ఛ

ముఖ్యమంత్రి రేవంత్ తీరు బాగున్నా ఎంపికలో పొరపాట్లు

చట్టం అవినీతి పరులకు చుట్టమవుతుంది.

ఉద్యమాలకు యువతరమే పునాది

ఓటు తొలగింపు నేరమే.. మీట్ ద ప్రెస్లో కూనంనేని



# ఆధ్యాత్మిక వైభవానికి అల్లీపురం వేదికగా శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

-మొదటిపేజీ తరువాయి

తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.భద్రాద్రి రాముడు కొలువైన ఖమ్మం జిల్లాలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.ఖమ్మం నగరంలోని అల్లీపురం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ స్థలాన్ని శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.ఆలయ నిర్మాణానికి కేటాయించిన భూమి విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుందని అన్నారు.భూసేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ నిర్మాణానికి ఎంతో భక్తి భావంతో ఆమోదం తెలిపారని మంత్రి పేర్కొన్నారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు సహకారంతో ఆలయ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ నెల 12న అంగరంగ వైభవంగా భూమి పూజ

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ఈ నెల 12న అల్లీపురం వద్ద ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.అమరావతిలోనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నమూనాలోనే అల్లీపురంలో ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.భూమిపూజ కార్యక్రమానికి ఖమ్మం నగరంలోని అన్ని సంఘాలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు.ఖమ్మం నగరం నుంచే కాకుండా నల్గొండ, వరంగల్ తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా భూమి పూజ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి సూచించారు. మీడియా ప్రతినిధులు ప్రత్యేక కథనాలు ప్రచురిస్తూ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ఖమ్మం

ఖమ్మం నగరంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఆలయం, స్వామి నారాయణ విద్యా సంస్థ, తదితర నిర్మాణాలు జరుగుతున్నా యని మంత్రి తెలిపారు. వీటితో ఖమ్మం నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందడంతో పాటు పర్యాటక రంగానికి కూడా ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.పర్యాటక రంగానికి ఉపయోగపడే విధంగా విశాలమైన పార్కింగ్ సౌకర్యంతో హరిత హోటల్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు.భూసేకరణ పూర్తి చేసిన అదనపు కలెక్టర్‌కు అభినందనలు,ధంసలాపురం ఎగ్జిట్,ఇంటిగ్రేటెడ్ స్కూల్,స్వామి నారాయణ విద్యా సంస్థలు ఇస్కాన్ ఆలయం,శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం,తదితర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూసేకరణను రైతులను ఒప్పించి విజయవంతంగా పూర్తి చేసిన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డిని మంత్రి అభినందించారు. రైతులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు.ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి స్థలాన్ని గుర్తించాలి.ఖమ్మం నగరానికి సంబంధించి ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. కార్యాలయ నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని గుర్తించి, అవసరమైన స్థల సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.నగర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.ఖమ్మం నగరంలో చేపడుతున్న రోప్‌వే, కేబుల్ బ్రిడ్జి, మెడికల్ కాలేజీ, మున్నేరు రిటైనింగ్ వాల్, తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయా అభివృద్ధి పనులను ప్రారంభించేలా పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఖమ్మం నగర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఖమ్మం ప్రాంతంలో గుర్తించిన అక్రమ మైనింగ్‌పై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.భూమి పూజకు పటిష్ట ఏర్పాట్లు మున్సిపల్ కమిషనర్

ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూలి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పటిష్టంగా చేపడతామని తెలిపారు.స్వామివారి దయతో ఆలయ నిర్మాణ పనులను రికార్డు సమయంలో పూర్తి చేసి ఖమ్మం నగరానికి తలమానికంగా నిలిచేలా కృషి చేస్తామని అన్నారు.ఆధ్యాత్మిక ప్రాంగణంగా అల్లీపురం: సుడా చైర్మన్

అల్లీపురం ప్రాంతం మొత్తం శ్రీ వెంకటేశ్వర స్వామి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకునేలా ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 12న నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆలయ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు టీటీడీ చైర్మన్‌తో సమన్వయం చేస్తున్నారని తెలిపారు.తిరుమల ఆధ్యాత్మిక ప్రతిబింబంగా ఆలయం: రాయల నాగేశ్వరరావులి

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్యాత్మిక ప్రతిబింబించేలా అల్లీపురంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం జరుగుతుందని తెలిపారు.స్వామి నారాయణ ఆలయం,మెడికల్ కాలేజీ,ఇస్కాన్ ఆలయం,తదితర నిర్మాణాలతో ఖమ్మం జిల్లాను పర్యాటకంగా,ఆధ్యాత్మికంగా,విద్యాపరంగా,వైద్యపరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామీణ ప్రజలకు భరోసానిచ్చే క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు అభినందనీయం

**సత్తుపల్లి అక్టోబర్03(ప్రజా జ్యోతి)** షిరిడీ సాయి జనమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం, సత్తుపల్లి మండలం చివరి గ్రామమైన నారాయణపురంలో రూ. 200 కోట్లకు పైగా అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన క్యాన్సర్ ఆసుపత్రి, వ్యాక్సినేషన్, ఉచిత వైద్య సహాయక కార్యక్రమాల ఏర్పాటుపై రాష్ట్ర రెవెన్యూ , హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తన స్వంత నియోజకవర్గంలో ఈ విధమైన బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల ట్రస్ట్ నిర్వాహకులకు, టీమ్ సభ్యులకు ఆయన మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు, హెచ్ పీవీ టీకాల కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, క్యాన్సర్ అనే మహమ్మారి ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారించవచ్చని, అయితే గ్రామీణ ప్రాంత ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల, వైద్య ఖర్చులకు భయపడి ఆలస్యంగా ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజన, గిరిజనేతర పేద కుటుంబాలకు ఆసుపత్రి ద్వారా వైద్యంతో పాటు వ్యాక్సినేషన్ ఒక్కొక్కరికి రూ. 7,000 రూపాయల విలువైన అందించి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ట్రస్ట్ ముందుకు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు.ఆసుపత్రి పరిసర ప్రాంతాలకు రోడ్డు వసతులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రతిపాదనలను రోజుల్లోగా తయారు చేసి తనకు పంపించాలని జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలతో వచ్చే ఈ వినతులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున వెంటనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పెద్ద మనసుతో భూమిని స్వల్ప ధరకు విక్రయించి సహకరించిన స్థానిక గ్రామస్తులను మంత్రి అభినందించారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టుకు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వ పరంగా పూర్తి అండదండలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ



కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఒకప్పుడు టీవీలలో, ఎక్కడో ఒకరికి వినే క్యాన్సర్ వ్యాధి, నేడు మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు, కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల ప్రతీ గ్రామంలోనూ కనిపిస్తూ సర్వసాధారణంగా మారిపోయిందని అన్నారు. క్యాన్సర్ చికిత్స అత్యంత ఖరీదైనది కావడం వల్ల సామాన్యులు భరించలేకపోతున్నారని, ఈ క్రమంలో శ్రీ జనమంగళం ట్రస్ట్ వ్యాధి ముదిరిపోకుండా ప్రివెంటబుల్ క్యాన్సర్ డిసీజ్, ఆర్లీ డిటెక్షన్ (ముందస్తు వ్యాధి నిర్ధారణ) సేవలపై దృష్టి సారించడం విశేషమని తెలిపారు. గ్రామీణ పేదలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించేలా ఈ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారని అన్నారు.కార్యక్రమంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ట్రస్ట్ నిర్వాహకులు రఘునాథరెడ్డి, సతీష్ రెడ్డి ల విజ్ఞప్తి మేరకు నారాయణపురం గ్రామస్తులు ఈ ఆసుపత్రి నిర్మాణానికి ఉదార హృదయంతో భూమిని అందించడం వల్లనే ఈ బృహత్తర కార్యక్రమం సాధ్యమైందని అన్నారు. మారుమూల, గిరిజన ప్రాంతాలైన అశ్వారావుపేట, ములకలపల్లితో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రజలకు ఈ ఆసుపత్రి ఎంతో మేలు చేస్తుందన్నారు. జీవనశైలి, ఆహార అలవాట్లు, కాలుష్యం కారణంగా ప్రతి పది కుటుంబాల్లో ఒకరికి క్యాన్సర్ ముప్పు పొంచి ఉన్న ఈ రోజుల్లో, ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు, ఉచిత వైద్య చికిత్సలు అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

హైదరాబాద్, ముంబై, చెన్నై, వేలూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే ప్రపంచ స్థాయి ఉచిత వైద్యం అందడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, ఈ ఆసుపత్రి విస్తరణకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్, సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, ఐటీడీఏ పీవో బి. రాహుల్, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మువ్వా విజయ్ బాబు,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి,గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య సేవలపై డీఎంహెచ్ఓ డా. రామారావు సమీక్ష




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు శనివారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య పరీక్షల నిర్వహణ, ప్రయోగశాల రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన సంయుక్త సంచాలకురాలిని కలిసి ఆసుపత్రిలోని వైద్య సేవలు,నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు.అనంతరం ఖమ్మం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో పర్యవేక్షకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న కార్యక్రమాల పురోగతి, క్షేత్రస్థాయి పర్యవేక్షణ,ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేలా అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ రామారావు సూచించారు.

## తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని అభినంధించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 01, 2026 వరకు హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ 5 వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026లో షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్ (గెజిటెడ్ ఆఫీసర్ క్యాటగిరిలో) తదితర క్రీడా పోటీల్లో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచి బంగారు,వెండి, కాస్యం పతకాలతో ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు గుర్తింపు తీసుకొచ్చిన అడిషనల్ డీసీపీ లు కుమారస్వామి, విజయబాబు,హెడ్ కానిస్టేబుల్ బి. దాసు, కానిస్టేబుల్ యండి.ఫైయాజ్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.క్రీడల్లో ప్రతిభ కనబర చడం ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని కమిషనర్ పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవడం ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని తెలిపారు.భవిష్యత్తులోనూ క్రీడా పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని పోలీసు సిబ్బందికి పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు.

# ఇంగ్లీష్ క్లాసులంటే... కేవీ నారాయణే

**బోనకల్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి) :**



ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని కోరుకునే విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లకు తనదైన శిక్షణా విధానంతో మార్గదర్శకంగా నిలుస్తున్నారు. బోనకల్ మండలం ముష్టికుంట గ్రామానికి చెందిన డా. కామిశెట్టి వెంకట్ నారాయణ (కేవీ నారాయణ). అడ్వాన్స్‌డ్ స్పోకెన్ ఇంగ్లీష్, ఐ ఈ ఎల్ టి ఎస్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. సాధారణంగా శిక్షణా సంస్థలు పెద్ద సంఖ్యలో విద్యార్థులను చేర్చుకుంటుండగా.. కేవీ నారాయణ మాత్రం ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టేందుకు పరిమిత సంఖ్యలోనే బ్యాచ్‌లను నిర్వహించడం ఆయన ప్రత్యేకతగా చెబుతున్నారు. దీంతో ఆయన క్లాసులకు హాజరయ్యేందుకు విద్యార్థులు, ఉద్యోగులు కొంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**విద్యా ప్రస్థానం...**

కేవీ నారాయణ పదో తరగతి వరకు స్వగ్రామమైన ముష్టికుంటలో, ఇంటర్మీడియట్‌ను నాగులవంచలో, డిగ్రీని ఖమ్మం సిద్ధారెడ్డి కాలేజీలో పూర్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి ఎం.ఏ. ఇంగ్లీష్, జేఎస్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ అభ్యసించారు.

**ఇంటివద్ద నుంచే ప్రత్యేక శిక్షణ...**

ప్రత్యేకత ఏమిటంటే.. పెద్ద ఎత్తున ప్రకటనలు, ప్రచారం లేకుండానే తన శిక్షణా తరగతులకు డిమాండ్ పెరగడం. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల లెక్చరర్లు, వివిధ శాఖల ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ఆయన తరగతులకు హాజరవుతున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. తరగతులను సులభమైన పద్ధతిలో నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఉన్న భయాన్ని తొలగించి, ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సహించడం తన బోధనా విధానంలో ముఖ్యాంశమని కేవీ నారాయణ పేర్కొంటున్నారు. ఉదయం 5 గంటలకే ప్రొఫెషనల్ బ్యాచ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకంగా నిర్వహించే బ్యాచ్‌లు ఉదయం 5 గంటలకే ప్రారంభమవుతాయి. ఉద్యోగులు తమ విధులకు వెళ్లే ముందు శిక్షణ పొందేలా ఈ సమయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

**మూడు బోర్డులతో వినూత్న బోధన...**

సాధారణంగా తరగతి గదిలో ఒక బోర్డును ఉపయోగించడం ఆనవాయితీ. అయితే కేవీ నారాయణ ఒకేసారి మూడు బోర్డులను ఉపయోగిస్తూ బోధించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ అంశాలను విద్యార్థులకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఆయన శిక్షణా విధానంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

**పేద విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహం...**

ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నామమాత్రపు ఫీజులతో శిక్షణ అందిస్తున్నట్లు కేవీ నారాయణ చెబుతున్నారు. ఆంగ్ల భాషపై భయాన్ని తొలగించడంతో పాటు ఉద్యోగ అవకాశాలకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ముష్టికుంట నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం.. స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ రంగంలో ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందని ఆయన శిక్షణ పొందిన విద్యార్థులు పేర్కొంటున్నారు.

# పోషకాహారంతో తల్లి, శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం

### గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మి



**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి:** గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మి సూచించారు...మండలం లోని చంద్రు తండా, హస్నాబాద్ గ్రామంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లి ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యానికి పునాది అని పేర్కొన్నారు. గర్భధారణ సమయంలో తల్లులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని లక్ష్మి సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు వంటి పోషక పదార్థాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. గర్భిణీలు వైద్యుల సూచనల మేరకు మందులు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.



బిడ్డ పుట్టిన తర్వాత తొలి ఆరు నెలలు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారమని తెలిపారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు వయసుకు తగిన అదనపు పోషకాహారాన్ని అందించాలని సూచించారు. చిన్నారుల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వారి బరువు, ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మి కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో సమన్వయం చేసుకుంటూ ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు పొందాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన నీటిని వినియోగించడం, పిల్లలకు పరిశుభ్రమైన ఆహారం అందించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు.

ప్రతి కుటుంబం పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన పెంచుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని సూపర్వైజర్ లక్ష్మి పేర్కొన్నారు. పోషణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆమె కోరారు.

కార్యక్రమంలో,చంద్రుతండ గ్రామ సర్పంచ్ భారతి, హాస్నాబాద్,గ్రామ సర్పంచ్ కొవ్వూరి పద్మ సత్తిరెడ్డి, హస్నాబాద్ గ్రామ కార్యదర్శి నర్మదా రెడ్డి, ఉపాధ్యాయులు జ్యోతి లక్ష్మి, ఏఎన్ఎం రేఖ ఇందిరా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈశ్వరి, ఝాన్సీ, విజయ, ఉపేంద్ర, సునీత,ఆశా కార్యకర్తలు, పల్లి రాధిక, బొబ్బిలి భవాని, మరియు గర్భిణీలు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పాలనలో సమన్వయ లోపం

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వ పాలనలో సమన్వయం లోపించిందని అది ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు బాగున్నా అనేక అంశాలకు సంబంధించి ప్రాధాన్యత ఎంపికలో పొరపాట్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య మూలాలు దెబ్బతింటున్నాయని పునాదిగా నిలిచిన ఓటు హక్కును తొలగించడం నేరమేనని ఆయన స్పష్టం చేశారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో శనివారం మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని కూనంనేనితో ఖమ్మంలో నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ యువతరం ప్రజా ఉద్యమాలకు పునాదిగా నిలిచిందని నాటి స్వాతంత్రోద్యమం, సాయుధ తెలంగాణ పోరాటం, తెలంగాణ సాధనోద్యమం, పేదల పక్షాన కమ్యూనిస్టు పార్టీ సాగించిన అనేక పోరాటాల్లో యువతరమే ముందు నిలిచిందన్నారు.ఇప్పుడు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జన్జీ ఉద్యమించడంతో దిమాగి నక్సల్స్ పేరుతో అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సర్ పేరుతో ఓట్ల తొలగింపు నేరమని ప్రజాస్వామ్యానికి ఓటే మూలస్తంభమని దానిని తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడవడమేనన్నారు. 60 కోట్ల భోఫోర్స్ కుంభకోణం కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతే లక్షల కోట్ల కుంభకోణాలు చోటు చేసుకున్న బిజెపి ప్రభుత్వాన్ని ఏవిధంగా శిక్షించాలని ఆయన ప్రశ్నించారు.జ్ఞానేష్కుమార్ దిగిపోవాల్సిందేనని లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం అవుతుందన్నారు. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని కొద్ది మంది చేతుల్లో సంపద పోగుపడుతుందని ఆయన తెలిపారు. జర్నలిస్టులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానం ఇస్తూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉన్న సొమ్మును సరైన రీతిలో ఈ ప్రభుత్వానికి ఖర్చు చేయడం చేతకావడం లేదన్నారు. ఆర్థిక వ్యవహారాలు కేంద్రీకృతమవుతున్నాయని వివిధ శాఖల్లో ఖర్చు పెట్టే అవకాశం లేకుండా పోయిందని మంత్రులు స్వేచ్ఛగా పాలన చేసే పరిస్థితి లేదన్నారు. దీనితో కొత్త పంచాయతీలు పుట్టుకొస్తున్నాయన్నారు. కొన్ని హామీలు నెరవేర్చిన అది చెప్పుకునే పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదని సాంబశివరావు తెలిపారు. బొగ్గు దొంగతనం అన్న ప్రచారంలోనూ కాంగ్రెస్ నిజాలను ప్రజలకు వివరించలేకపోయిందన్నారు. ధరణి వల్లనే బిఆర్ఎస్ ఓడిపోయిందని ఇప్పుడు కాంగ్రెస్ కూడా సరైన రీతిలో వ్యవహరించకపోతే ముప్పు తప్పదన్నారు. ఏ ప్రభుత్వమైనా నిషేధిత జాబితాను కొనసాగిస్తారని కానీ చిన్న చిన్న పొరపాట్లు పెద్ద ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం అనుభవదారు కాలాన్ని రద్దు చేయడం మళ్లీ భూ యజమానులకు ఊతమిచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకో సమర్థవంతంగా నడపలేకపోతుందన్న భావన వ్యక్తమవుతుందన్నారు.మిత్రపక్షంగా ఉన్న తమకు తెలపకుండానే మా అనుబంధ సంఘాన్ని ఆర్టీసి ఎన్నికల్లో ఓడించేందుకు ప్రయత్నం చేయడం ఓ మంత్రి కమ్యూనిస్టు సంఘాలను ఉద్దేశించి మాట్లాడటం ఇబ్బందికరమన్నారు.కమ్యూనిస్టు యూనియన్లను గెలవనివ్వవద్దన్న ఆయన తీరు సరి కాదని సాంబశివరావు తెలిపారు. ఎంఎల్సి ఎన్నికల్లో పోటీ చేయాలా ఎవరికి మద్దతు ఇవ్వాలా అన్న దానిపై ఇంకా నిర్ణయించలేదన్నారు.కొత్తగూడెం నియోజక వర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యంపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ అన్ని నియోజక వర్గాల మాదిరి కొత్తగూడెంలో కూడా పర్యటిస్తే తప్పులేదు కానీ తరచూ పర్యటనలు చేయడం శత్రుపక్ష శాసన సభ్యుని పట్ల వ్యవహరించడం సరికాదన్నారు.అంతిమంగా ప్రజలే నిర్ణేతలన్నారు. మిత్రపక్ష శాసనసభ్యుడు ఉన్న చోట అంతగా పట్టించుకోవాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. కమ్యూనిస్టుల నైతిక మద్దతు కాంగ్రెస్ గెలుపులో కీలక భూమిక పోషించిందన్నారు. ఆర్టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కమ్యూనిస్టులు విడివిడిగా పోటీ చేయడాన్ని ప్రస్తావిస్తూ కలిసిపోతే తప్ప రెండు పార్టీలు విడివిడిగా ఉన్నప్పుడు ఇటువంటి పరిస్థితులు ఎదుర్కొనక తప్పదన్నారు. ప్రజా ఉపయోగకర కార్యక్రమాలు చేపట్టినప్పుడు మిత్రపక్షంగా సమర్థిస్తామని ప్రజలకు నష్టం జరిగే కార్యక్రమాలకు సంబంధించి ప్రశ్నించక తప్పదని ఆయన తెలిపారు. ప్రశ్నించే వారి పట్ల గత ప్రభుత్వం మాదిరే వ్యవహరిస్తూ ముందస్తు అరెస్టులు, ఆందోళనలు అణిచివేతలు చేస్తే గత ఫలితమే పునరావృతమవుతుందన్నారు.టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం...

## మంత్రి పొంగులేటి సహాయం అభినందనీయం..

## సర్పంచ్ నందిపాటి మల్లికార్జున్

**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి అక్టోబర్ 3** "ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన ఆదేశాలతో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం అభినందనీయమని. సర్పంచ్ నందిపాటి మల్లికార్జున్ అన్నారు. పిఎస్ఆర్ ట్రస్ట్. ద్వారా. పాలేరు నియోజకవర్గం లో. దురదృష్టవశాత్తు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి అండగా ఉంటూ పేద కుటుంబాల కష్టాలను గుర్తించి, వారికి అవసరమైన సమయంలో ఆర్థికంగా అండగా నిలవడం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మానవతా దృక్పథానికి నిదర్శనం.అన్నారు. బచ్చోడు గ్రామానికి చెందిన ఎరుకలి సురేష్ కుటుంబానికి మంత్రి ఆదేశాల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా. శనివారం అందించిన రూ.10 వేల ఆర్థిక సహాయం వారికి ఎంతో కొంత ఊరటనిస్తుంది. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి,



పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌కు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం" అని సర్పంచ్ నందిపాటి మల్లికార్జున్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల అశోక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రామసహాయం అరవింద్ రెడ్డి, నందిపాటి ఉపేందర్, పదో వార్డు సభ్యుడు దారమల శంకర్, గొర్రెపాటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** శ్రీ కృష్ణప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.స్కూల్ చైర్ పర్సన్ నిష్ఠాశర్మ ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు.తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని పాఠశాలలో ఉపాధ్యాయులు బతుకమ్మ ఉత్సవాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థుల ఆట,పాటలు అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు,ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆటో ఛార్జీలు పెంచుతూ రవాణా శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మొదటి 1.6 కిలోమీటర్ల కనీస దూర ప్రయాణానికి ఛార్జీని రూ.30గా ఖరారు.1.6 కిలోమీటర్లు దాటిన తర్వాత ప్రతి అదనపు కిలోమీటర్‌కు రూ.14 వసూలువెయిటింగ్ ఛార్జీలు నిమిషానికి 75 పైసలు రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య సాధారణ ఛార్జీపై అదనంగా ఒకటిన్నర రెట్లు వసూలు బ్రీఫ్‌కేస్,హ్యాండ్‌బ్యాగ్ మినహా ఇతర లగేజీ ప్యాకేజీలకు ఒక్కోదానికి 50 పైసలు చొప్పున ఛార్జీ ప్రయాణికులు ఆటోలో గరిష్టంగా 100 కిలోగ్రాముల వరకు లగేజీని తీసుకెళ్లేందుకు అనుమతి

## ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారంను తీసుకోవాలి.



**నేలకొండపల్లి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి :** ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారం ను తీసుకోవాలని కొత్తకొత్తూరు సర్పంచ్ "మాళోత్ కవిత సూచించారు. మండలం లోని కొత్తకొత్తూరు అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసోత్సవం ను నిర్వహించారు. గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన్న కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. దీని వలన రక్తహీనత, పోషకాహార లోపం ను నివారించవచ్చునని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, అంగన్వాడీ టీచర్ స్వాతి. ఆశా వర్కర్ సంధ్యా, గ్రామ పెద్దలు ఆయోధ్యరామయ్య, ఆయా, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి తీరుతో ప్రజాస్వామ్యానికి విఘాతం

**-కాంగ్రెస్ తీరు మార్చుకోవాలి**
**-ప్రజా ఉద్యమాలతోనే పార్టీ బలోపేతం**
**-సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో కూనంనేని**




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** బిజెపి తీరుతో ప్రజాస్వామ్యానికి విఘాతం ఏర్పడిందని ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రాథమిక హక్కుగా ఉన్న ఓటు హక్కును తొలగించడం నేరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. -బిజెపి మొత్తం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని అందుకే దేశ వ్యాప్తంగా ఓటు పరిరక్షణ పేరుతో ప్రజా ఉద్యమాలు రూపుదిద్దుకుంటున్నాయని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా సమితి సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ దేశంలో యువతలో ప్రశ్నించే తత్వం పెరుగుతుందని అందుకే ప్రజా ఉద్యమాలు రూపుదిద్దుకుంటున్నాయని -జనీ కూడా ఇందులో భాగమేనని ఆయన తెలిపారు. బిజెపి నేరాన్ని సైతం చట్టబద్ధంగా మార్చిందని దీని వల్ల దేశంలో ఆర్థిక -నేరాలు పెరుగుతున్నాయన్నారు. కేవలం అతి కొద్ది మంది చేతుల్లో 90 శాతం సంపద పోగుబడిందని ఆయన ఆరోపించారు. కొంత మంది మేధావులు పేదలకు సంక్షేమంపై వితండ వాదం చేస్తున్నారు కానీ లక్షల కోట్ల రూపాయలు సంపన్న వర్గాలకు రాయితీల పేరుతో రద్దు చేస్తే ఎందుకు ప్రశ్నించ లేదన్నారు. ఇప్పుడు చట్టాలు అవినీతి పరులకు చుట్టంగా మారాయని ఆయన తెలిపారు. వేతనాలు అతి తక్కువగా ఉండటం, ధరలు పెరుగుతుండటం ప్రజలను ఇబ్బందులు పెడుతుందని ధరల -నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ తన తీరు మార్చుకోవాలన్నారు. ప్రజలకు జవాబుదారి తనం వహించడం లేదని కేవలం విపక్షాలపై దాడి మాత్రమే ప్రభుత్వ పని కాదన్నారు. ఆర్థికంగా లోటు ఉన్న ప్రజల సంక్షేమాన్ని విస్మరించరాదన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ఈ ప్రభుత్వం విఫలమవుతుందన్న భావన ప్రజల్లో బలపడుతుందని ఆరు గ్యారెంటీల అమలుకు ఈ ప్రభుత్వం పూనుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 22ఎలో పేదలకు అన్యాయం జరిగితే సహించబోమన్నారు. ఈ నేపంతో దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకుంటే భూ పోరాటం తప్పదని కూనంనేని హెచ్చరించారు. పింఛన్ల పెంపు,ఫీజు రీయంబర్స్మెంట్ పాటు పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టిసి ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ దాని మిత్రపక్షాల -విజయం కోసం సిపిఐ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాట మార్గాన్ని ఎంచుకోవాలని ఆయన సూచించారు. ప్రజా ఉద్యమ నిర్మాణంతోనే పార్టీ బలోపేతం అవుతుందని ఆయన తెలిపారు. ఈ -సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు,సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి పాల్గొన్నారు.

## అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో, రాంప్రసాద్ గురుస్వామి మరియు పగడాల కిషోర్ ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాలుగా నిర్విరామంగా నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములకు 71 రోజుల అన్నప్రసాద పీఠం ఈ సంవత్సరం 18వ వార్షికోత్సవంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా భూమి పూజ కార్యక్రమం జంశీం కాలనీ వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న స్థలం లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గత 17 సంవత్సరాలుగా అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నప్రసాదం అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సంవత్సరం 18వ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా 71 రోజుల పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాంప్రసాద్ గురుస్వామి మరియు పగడాల కిషోర్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి భక్తులు, దాతలు సహకరించాలని కోరారు. ఈ భూమి పూజ కార్యక్రమం లో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నాగ రామాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి బజ్జూరి రమణారెడ్డి , టౌన్ అధ్యక్షులు కోయ హరికిషన్, కార్యదర్శి శ్రీనివాస్ , ప్రచార కార్యదర్శి గోపాలరెడ్డి, అరుణ్ ఇంకా జిల్లా కమిటీ నుండి రాజ్యలక్ష్మి ,సత్యన్నారాయణస్వామి,శ్రీను స్వామి, శేఖర్ స్వామి, వేణు తదితర భక్తులు పాల్గొన్నారు.

# పోషకాహారము పరిశుభ్రత తోనే రక్తహీనత సమస్యలు లేకుండా సుఖ ప్రసవం.

**జిల్లా సంక్షేమ అధికారిని ప్రమీల.**



**చింతకాని అక్టోబర్ 03ప్రజాజ్యోతి :** పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా రక్తహీనత సమస్యలు లేకుండా గర్భిణీలు సుఖ ప్రసవం అవుతారని ఐసిడిఎస్ జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల అన్నారు. ఖమ్మం రూరల్ ప్రాజెక్ట్ సిడిపిఓ చావ కమల ప్రియ ఆధ్వర్యంలో చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెం రైతు వేదికలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో ప్రమీల మాట్లాడుతూ తల్లి, బిడ్డల సంక్షేమం లక్ష్యంగా అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పోషకాహార లోపం వలన పలు అనారోగ్య సమస్యలు వస్తాయని అందువల్ల గర్భిణీ గా గుర్తించిన దగ్గర్నుంచి అంగన్వాడి కేంద్రంలో పేరు నమోదు చేసుకొని ప్రభుత్వం అందించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుని, అంగన్వాడి టీచర్లు ఇచ్చే సలహాలు సూచనలు పాటిస్తూ ఆరోగ్యశాఖ సహకారంతో అందించే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నెల తప్పిన దగ్గర్నుంచి బిడ్డకు 2 సంవత్సరాల వయసు వచ్చేవరకు మధ్య 1000 రోజుల సమయాన్ని బంగారు రోజులుగా అభివర్ణించారు. పుట్టిన బిడ్డ రెండు సంవత్సరాల వరకు ఎదుగుదల వేగంగా ఉంటుందని శారీరకంగా, మానసికంగా చాలా పరిణితి చెందుతారని అందువల్ల ఈ మధ్య కాలాన్ని బంగారు రోజులుగా పరిగణిస్తామన్నారు. సిడిపిఓ కమల ప్రియ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలంటే ఆర్థిక భారం అవకుండా అంగన్వాడి టీచర్లు స్వయంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు శుభ్రముగా, రుచికరముగా తయారు చేసి ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్నారని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తహసిల్దార్ కరుణ శ్రీ, మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ,చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రశంసించారు. చిన్నారులకు ఆటపాటలతో క్రమ శిక్షణ కలిగిన విద్యాబోధన అందిస్తూ బాల్యారంబ దశను బంగారు బాటలో నడిపిస్తున్నారని అన్నారు. ఆర్.బి.ఎస్.కె జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, పి హెచ్ సి వైద్యులు డాక్టర్ వివి రావు మాట్లాడుతూ ఆరోగ్యశాఖ ఐసిడిఎస్ సమన్వయంతో తల్లి బిడ్డల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునికరించిన వైద్య సదుపాయాలు ఉన్నాయని గర్భిణీలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించకుండా గవర్నమెంట్ ఆసుపత్రులలో డెలివరీ అవ్వాలని కోరారు. లచ్చగూడెం సర్పంచ్ కొప్పుల రజిని, వందనం గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు లు మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి గర్భిణీలు బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తూ చిన్నారులకు చక్కటి విద్యాబోధన అందిస్తున్న అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని , ఆటోలు వ్యానుల ద్వారా పిల్లలను దూర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాలకు పంపకుండా స్థానికంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచన చేశారు. ఐసిపిఎస్ జిల్లా కోఆర్డినేటర్ తస్లిమ్ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలని అన్నారు. అనంతరం గర్భిణీలకు సాంప్రదాయ పద్ధతిలో చీర సారె, పూలు ,పండ్లు చలిమిడి బొట్టు గాజులతో వడి నింపి కుటుంబ సభ్యుల సమక్షంలో సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి, నాగులవంచ సెక్టార్ సూపర్వైజర్ సత్యవతి పోషణ అభియాన్ బాధ్యులు కొమ్మినేని బాబు, షామిలి , టీచర్లు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# గతంలో దొరల ప్రభుత్వం కాదు... పేదోడి ప్రజా ప్రభుత్వం.

**నేలకొండపల్లి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి :** గతంలో పాలకులు దొరల ప్రభుత్వం ను నడిపించారని...తమది పేదోడి పక్షాన నిలిచే ప్రజా ప్రభుత్వమని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలం లోని కట్టుకాచారం లో పాలేరు వాగు పై రూ.6.65 కోట్లతో నూతనంగా నిర్మించిన చెక్ డ్యామ్ ను ప్రారంభించారు. అదే విధంగా రూ.2.50 కోట్లతో వట్టకుంట వాగు' వరకు బీటి రోడు నిర్మాణానికి కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంఖుస్థాపన చేశారు. 31 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కలనుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...చెక్ డ్యామ్ తో నేలకొండపల్లి మండలం తో పాటు, సూర్యాపేట జిల్లా, అనంతగిరి మండలంకు సాగునీరు అందుతుందన్నారు. ఎల్నినో పరిస్థితులలో చెక్ డ్యామ్ నిర్మాణం పూర్తి కావటంతో రైతులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. సాగు, తాగునీటి మెరుగుపడుతుండటంతో ప్రజలు, రైతులు సంతోషం ను వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎల్నినో ప్రభావం ఉన్నప్పటికీ 'తాగు, సాగు నీటికి కొరత పరిస్థితులు రానీయకుండా చూస్తున్నామన్నారు. ఇటీవల తుపాన్ తో కొంత మేలు జరిగిందన్నారు. విద్యుత్ కొరత రానీయకుండా అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచియూనిట్ రూ.12 చొప్పున కొనేందుకైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రత్యామ్నయంగా సౌర తదితర విద్యుత్ ప్రాజెక్ట్ లపై కూడ దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ కొరత పరిష్కారం పై ఇటీవల కేబినెట్ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజల చిరకాల కల అయిన సొంతింటిని ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సాధ్యం చేశామని తెలిపారు. మొదటి విడతలో 2.25 లక్షల ఇళ్లు పూర్తి చేశామని, రెండో విడత కూడ కేటాయించామని, ఒక్క హైద్రాబాద్ లోనే లక్ష ఇళ్లు కేటాయించామని స్పష్టం చేశారు. కట్టుకాచారంలో 35 నెలలో రూ.13.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పోటీ పడేలా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి జరుగుతుందన్నారు. ఈ సభలో కలెక్టర్ దివాకర టీఎస్. మాట్లాడుతూ..ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో చెక్ డ్యామ్ వల్ల రైతులు సంతోషంగా ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు.250 ఎకరాల ఆయకట్టు సాగునీటి ప్రయోజనం కలుగుతుందన్నారు. చెక్ డ్యామ్ ను చాలా తక్కువ కాలంలో పూర్తి చేశారని అన్నారు. ఎల్నినో పరిస్థితులలో ఈ చెక్ డ్యామ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సీఈ వాసంతి, ఎస్.ఈ. యం. వెంకటేశ్వర్లు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి,



ఆర్అండ్ బి ఎస్.ఈ.యుగంధర్ రావు, హౌజింగ్ పీడీ శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ పొట్టయ్య, జేఈ లు తాళ్లూరి నరేష్, షేక్ మదీనా, యం.రుత్విన్ రెడ్డి,కె.కేతిరెడ్డి, ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్ లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లలో సర్పంచ్లకు కనీసం ప్రాధాన్యత ఇవ్వండి.

మిషన్ భగరథ నీటి సరఫరా అస్తవ్యస్థంగా మారుతుంది.

సర్వసభ్య సమావేశంలో సర్పంచ్లు పలు ఫిర్యాదులు.



**నేలకొండపల్లి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సర్పంచ్లకు కనీసం ప్రాధాన్యత ఇవ్వాలని రాజేశ్వరపురం సర్పంచ్ దండా రంగయ్య డిమాండ్ చేశారు.శనివారం మండల పరిషత్ జరిగినసర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్లు వివిధ సమస్యల పై ప్రశ్నించారు. గ్రామాలలో ఇందిరమ్మ కమిటీల పేరుతో సర్పంచ్ లను అవమానిస్తున్నా రని ఆరోపించారు. కనీసం వచ్చిన ఇళ్లలో సర్పంచ్లకు 10 శాతం ఇవ్వాలని కోరారు. ఖచ్చితంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక లో సర్పంచ్లను భాగస్వామ్యులను చేయాలని డిమాండ్ చేశారు. ఎల్నినో ప్రభావం ఉందని చెబుతున్నారని . కానీ.. రైతులకు సబ్సీడీ విత్తనాలు ఇవ్వటం లేదని ఆరోపించారు. ఉపాధి "హామీ పథకం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే జాబ్ కార్డులు ఇవ్వాలని కోరారు. మిషన్ భగీరథ తాగునీరు సరఫరా అస్తవ్యస్తంగా మారిందని మోటాపురం సర్పంచ్ ఏలూరి రామారావు ఆరోపించారు. నాలుగు రోజులకోకసారి నీటి సరఫరా జరుగుతుందన్నారు. సిబ్బందికి పలుమార్లు చెప్పిన వారి తీరు మారటం లేదని ఆరోపించారు. అదే విధంగా పంచాయతీ కార్మికులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని..మరి కొన్ని చోట్ల రాజకీయాలు చేస్తున్నారని వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. వివిధ గ్రామాలలో పంచాయతీ లో సమస్యల పై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇది ఇలా ఉండగా...సర్వసభ్య సమావేశం కు చాలా మంది సర్పంచ్, అధికారులు దుమ్మా కొట్టారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీయం కె. సురేందర్ బాబు, ఈజీఎస్ ఏపీవో అమ్మజాన్, పీఆర్ ఏఈ ప్రసాద్, మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, సర్పంచ్ లు కమదన ప్రవీణ్, పి.ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరి పై ఉంది. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ పి.డానియేల్.

**నేలకొండపల్లి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి :** వన్య ప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరి పై ఉందని అటవీశాఖ కూసుమంచి రేంజ్, నేలకొండపల్లి సెక్షన్ ఆఫీసర్ పి.డానియేల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో వన్య ప్రాణి వారోత్సవాల సందర్భంగా శనివారం అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ఈ నెల 2 నుంచి 8 వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జంతువుల ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరి పై ఉందన్నారు. వన్యప్రాణులు జన సంచారంలోకి వస్తే...తమకు ఫిర్యాదు చేస్తే పట్టుకుని అడవిలో వదిలేస్తామన్నారు. కావునా ప్రజలు వాటిని చంపకుండా సంరక్షించేందుకు సాధ్యమైన వరకు తగిన చర్యలు తీసుకోవాలన్ని సూచించారు. అడవులు, వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతకు ఎంతో అవసరమని అన్నారు. వాటిని వేటాడం, హని కలిగించటం చట్టరీత్యా నే రమని తెలిపారు. వన్యప్రాణుల



రక్షణలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాస రావు, మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, సర్పంచ్ దండా రంగయ్య, కమదన ప్రవీణ్, రామారావు, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎస్ఆర్ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందజేత చైర్మన్ సీతారాములు

**నేలకొండపల్లి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి :** తెలంగాణ రెవిన్యూ, గృహనిర్మాణం మరియు సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు నియోజకవర్గంలో పలు సంక్షేమ పథకాలతో అభివృద్ధి చేస్తూ, పేదలపాలిటి పెన్నిధిగా పేదవారి కష్ట సుఖలలో వారికి పి ఎస్ ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం చేస్తూ వారికి అండగా నిలబడుతున్నారని నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు.నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. కొత్త కొత్తూరు, రాయగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పొడుగు సైదులు కుటుంబానికి శ్రీనన్న పది వేల రూపాయలు పంపించ్చినారు అని అన్నారు. సర్పంచ్ మాళోతు కళావతి శ్రీనన్న ఆర్థిక సహాయాన్ని సైదులు కుటుంబానికి అందించినారు. ఈ కార్యక్రమంలో రాయి గూడెం సర్పంచ్ బోయిన వేణు, ఇరగ దిండ్ల నాగరాజు, బోయన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. కొత్త కొత్తూరులో ఉపసర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, వార్డ్ మెంబర్లు గుగులోత్ వెంకటి,చిక్కు భద్రకాళి, పాగర్తి శ్రీను, రాగూర్ రాంసింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రావేళ్ళ జ్యోతి బాస్, మళోతు అయోధ్య రామయ్య, జాల కొండలు, మాజీ సర్పంచ్ ఎని మస్తాన్, భూక్యా రవి రమేష్ తదితరులు పాల్గొన్నారు



## కల్లూరులో కోర్టు ఏర్పాటు కోసం సంతకాల సేకరణ



**కల్లూరు, అక్టోబర్ 03 : ప్రజా జ్యోతి** కల్లూరు రెవిన్యూ డివిజన్ కేంద్రంలో జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పోర్ట్ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజాప్రతినిధులు నాయకులు బృహత్తర సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కల్లూరులో కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ఏర్పాటు డిమాండ్ తో సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని రాష్ట్ర మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డికి అందజేసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళేందుకు నాయకులు సిద్ధమవుతున్నారు. కల్లూరు రెవిన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్నందున ఇక్కడ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**వేంసూరు, అక్టోబర్ 03** ప్రజాజ్యోతి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామంలో గల పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్‌ను తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు ఈ నెల 8వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొంతు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు నవంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నెలకు రూ. 16,500 గౌరవ వేతనం చెల్లిస్తామని తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్,బీఈడీ జనరల్ ఎడ్యుకేషన్,ఒకటి లేదా రెండేళ్ల పీజీ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ తదితర అర్హతలు ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు.

## మాజీ జెడ్పీటిసి భాషానాయక్ ని పరామర్శించిన దయాకర్ రెడ్డి



**వేంసూర్ అక్టోబర్ 3 ప్రజాజ్యోతి :** వేంసూరు మండలం లోని చౌడవరం తండా గ్రామపంచాయతీ మాజీ జెడ్పీటిసి భాషా నాయక్ ని తుమ్మూరు దయాకర్ రెడ్డి పరామర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కొండపల్లి పుల్లారెడ్డి, భూక్య నాగులు, గొర్ల బోనసుందర్ రెడ్డి, గడ్డం సత్యనారాయణ రెడ్డి, నాగకృష్ణ,పసుమర్తి సత్తిబాబు, ఈలప్రోలు నవీన్, వెంకట నాగేశ్వరరావు,నాగ నరసింహ స్వామి, సోలా వెంకటేశ్వరరావు,జంగా జమలయ్య,నాగ అశోక్ యాదవ్, బానోతు రామ్ చంద్,లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థి వైద్య విద్యకు 'మాస్' చేయూత.

**ఎంబీబీఎస్ విద్యార్థి కార్తీక్‌కు రూ.35 వేల ఆర్థిక సాయం.**

**ఏఈఓ శ్రీనివాసరావు నుంచి మరో రూ.15 వేల విరాళం.**



**చింతకాని, అక్టోబర్ 3 ( ప్రజాజ్యోతి):** ఒక నిరుపేద విద్యార్థి చదువుకు చేయూతనివ్వడం ద్వారా ఆ కుటుంబంలో వెలుగులు నింపవచ్చని మహా ఆది సేవా సమితి (మాస్) మరోసారి నిరూపించింది. మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి తెల్లూరి కార్తీక్ హైదరాబాద్‌లోని సీఎమ్ఆర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ హాస్టల్, మెస్ ఫీజులు చెల్లించడం ఆర్థికంగా భారంగా మారడంతో ఇబ్బంది పడుతున్న కార్తీక్ పరిస్థితిని తెలుసుకున్న మాస్ ప్రతినిధులు తక్షణమే స్పందించి రూ. 35,000 ఆర్థిక సాయం అందించారు. అలాగే విద్యార్థి పరిస్థితిని తెలుసుకున్న ఖమ్మం ఎస్సీ కార్పొరేషన్ ఏఈఓ తెల్లూరి శ్రీనివాసరావు తనవంతుగా రూ. 15,000 ప్రత్యేక విరాళంగా అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యకు చేయూత అందించడం ద్వారా సమాజాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఉద్యోగులుగా ఉన్నవారు సమాజానికి తిరిగి సేవ చేయాలనే 'పే బ్యాక్ టు సొసైటీ' స్ఫూర్తితో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. కార్తీక్ భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి సమాజానికి సేవలందించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఏఈఓ తెల్లూరి శ్రీనివాసరావుతో పాటు మాస్ ప్రతినిధులు, ఉద్యోగులు పొట్టపింజేర రామయ్య (ఎస్ఓ), మోదుగు వేలాద్రి (ఎస్‌టీఓ), ఎక్కిరాల కృష్ణయ్య (టీఏ), కారుమంచి వెంకట కృష్ణ (టీఏ), బొడ్డు వెంకట కృష్ణ (జూనియర్ అసిస్టెంట్) తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ.





**నాణ్యమైన విద్య, భోజనం లో రాజీ పడొద్దు.**

**సర్పంచ్ ధీరావత్ అశోక రాణి.**

**నేలకొండపల్లి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి** నెలకొండపల్లి మండల కేంద్రంలోని మంగాపురం ప్రభుత్వ పాఠశాలలో జెడ్ పి ఎస్ ఎస్ హై స్కూల్ లో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్కూల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. నాణ్యమైన విద్య. భోజనం అందించటం లో రాజీ పడొద్దని మంగాపురతండా సర్పంచ్ ధీరావత్ అశోకా రాణి సూచించారు. మండలం లోని మంగాపురతండా స్థానిక ప్రభుత్వ పాఠశాల లను శనివారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నూరు శాతం హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులను స్వయంగా నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. విద్య బోధన ఎలా ఉందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... విద్య. భోజనం లో ఎలాంటి నిర్లక్ష్యం . చేయవద్దని సూచించారు. విద్య బోధన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు ఇంటి వద్ద తిన్నంతా మాదిరిగానే వారికి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీఎస్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు, చెరువు మాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, ఉప సర్పంచ్ నాగరాజు బుడక నాయక్ ,'గోబ్రియా నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి అక్టోబర్03(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని కిష్టారం గ్రామానికి పుచ్చకాయల లక్ష్మారెడ్డి వారి అమ్మకు వారి సతీమణి గత నెల 12వ తారీకు గ్రీన్ ఫీల్డ్ హైవే మీద యాక్సిడెంట్ అవ్వగా,కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ఇద్దరు స్పాట్లో మరణించగా మా గ్రామ నివాసులు ముగ్గురు గాయాలతో బయటపడి ఇంటి దగ్గిర విశ్రాంతి తీసుకుంటుండగా, విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ విషయాన్ని తెలుసుకొని శనివారం వారి స్వగృహానికి వెళ్లి, గ్రామ సర్పంచ్ నరుకుల్ల రాజేశ్వరి అప్పారావు గ్రామ పెద్దలు ఉడతనేని అప్పారావు మరియు గ్రామ ప్రజలు పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబాలకు ధైర్యాన్ని నింపి, మీకు ఏ సాయం కావాలన్నా నేను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ,గ్రామ పెద్దలు ఉన్నారు.





- కొంతమంది ఆర్ఎంపీలు, ప్రైవేట్ ఆస్పత్రులతో కుమ్మక్కు అన్న ఆరోపణలు
- టెస్టులు, మందుల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారంటూ బాధితుల ఆవేదన
- అర్హతకు మించి చికిత్స చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం
- ఈ వ్యవహారంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ దృష్టిపెట్టాలంటున్న మండల ప్రజలు

# వైద్యం పేరుతో నిలువు దోపిడీ

**బోనకల్, అక్టోబర్ 3(ప్రజా జ్యోతి):**

గ్రామీణ ప్రజల ఆరోగ్య సమస్యలను ఆసరాగా చేసుకొని మండలంలో కొంతమంది ఆర్ఎంపి వైద్యులు వైద్యం పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు మండలంలో జోరుగా వినిపిస్తున్నాయి. అర్హతకు మించి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతూ చిన్న చిన్న జబ్బులకే పెద్ద చికిత్సలు అవసరమని భయపెట్టి పేషెంట్లను పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లి అనవసర పరీక్షలు చేయిస్తున్నారని మండలంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరం ఉన్నా లేకున్నా ఇంజక్షన్లు , సిలైన్లతో వైద్యం చేస్తున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. గ్రామాల్లో చిన్న సమస్యలతో ఆర్ఎంపి వైద్యులను సంప్రదించిన ప్రజలకు మొదట కొన్ని ఇంజెక్షన్లు ఇచ్చి, ఇక్కడ తగ్గదని చెప్పి వెంటనే పట్టణానికి తీసుకెళ్లాలని భయపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా పట్టణాల్లోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులకు మాత్రమే పేషెంట్లను తరలిస్తున్నారని మండలంలోని ప్రజలు చెబుతున్నారు.

**ప్రైవేట్ ఆస్పత్రులతో ముందస్తు సంబంధాలు..?**

మండలంలోని కొంతమంది ఆర్ఎంపీలు ముందుగానే ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులకు ముందుగా సమాచారం ఇచ్చి పేషెంట్లను తీసుకెళ్తారని, ఆస్పత్రిలో ఎంతమంది ఉన్నా ముందుగా వారినే డాక్టర్ వద్దకు పంపిస్తారని సమాచారం. ఆ తర్వాత ప్రైవేట్ డాక్టర్లు కూడా ఆర్ఎంపి చెప్పినట్లుగా విని అనవసరంగా అనేక పరీక్షలు రాసి ల్యాబ్ కు పంపిస్తూ భారీగా ఖర్చు చేయిస్తున్నారని కొంతమంది బాధితులు చెబుతున్నారు.

**టెస్టుల పేరుతో వేల రూపాయల ఖర్చు..?**

ఒక్కో పేషెంట్ కు టెస్టుల పేరుతో రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చు అవుతుందని, అందులో కొంత శాతం ఆర్ఎంపి వైద్యులకు

కమిషన్ గా వెళ్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అనుభవం మండలంలో పలువురు పేషెంట్లు ఎదుర్కొన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం మండలంలో జ్వరాల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజల ఆరోగ్య సమస్యలను ఆసరాగా చేసుకొని వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ ఈ తతంగం కొనసాగిస్తున్నారు. స్థానికంగా ఇంత జరుగుతున్న ఈ వ్యవహారంపై సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సుబ్లేడులో గాంధీ విగ్రహం ధ్వంసం

**గుర్తుతెలియని వ్యక్తుల చర్యపై గ్రామస్థుల ఆగ్రహం**

**తిరుమలాయపాలెం,ప్రజా జ్యోతి అక్టోబర్ 3 :** తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహం ధ్వంసమైన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం దెబ్బతిన్న స్థితిలో ఉండటాన్ని స్థానికులు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఘటనకు పాల్పడిన వ్యక్తులు ఎవరనేది ఇంకా తెలియరాలేదు. మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఘటనకు కారణాలను గుర్తించి, బాధ్యులను చట్టపరంగా గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటన నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విగ్రహ ధ్వంసంపై పోలీసులు



దర్యాప్తు చేపట్టి, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల ప్రమేయంపై ఆధారాలను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే ధ్వంసమైన విగ్రహాన్ని పునరుద్ధరించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## కల్లూరు అభివృద్ధికి మరో అడుగు

**17వ వార్డులో రోడ్లు డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగిలేటి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్**



**కల్లూరు, అక్టోబర్ 03 : ప్రజా జ్యోతి** కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడిన కల్లూరు పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా శనివారం కల్లూరు మున్సిపాలిటీ 17వ వార్డులో అంతర్గత రోడ్లు డ్రైనేజీ నిర్మాణ పనులకు మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కల్లూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజలకు అవసరమైన రోడ్లు డ్రైనేజీ వంటి మౌలిక వసతులను దశల వారీగా కల్పిస్తామని తెలిపారు చేపట్టిన పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. 17 వార్డులో రోడ్లు డ్రైనేజీ పనులు ప్రారంభించడం ద్వారా స్థానికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అభివృద్ధి చెందిన మున్సిపాలిటీగా తీర్చి విద్య అందుకు మంత్రులు ప్రజాప్రతినిధుల సహకారంతో నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా కలెక్టర్ దివాకర్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోట్రూ అర్జున్ రావు, మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, వైయస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.కె ఉస్మాన్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజల పాల్గొన్నారు..

# పేదల సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రభుత్వం

## రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్,సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## తల్లాడ మండలం పినపాక గ్రామంలో 79 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి







**తల్లాడ ప్రజా జ్యోతి** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం పేదల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం తల్లాడ మండలం పిన్నపాక గ్రామంలో మంత్రి 79 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్,సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి తో కలిసి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.గత ప్రభుత్వ తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8,21,000 కోట్ల అప్పుల్లోకి నెట్టివేశారని,కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారీగా నిధులు వృధా చేశారని విమర్శించారు. పేదవారికి ఇళ్లు ఇవ్వాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి రాలేదన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఇందులో ఇప్పటికే దాదాపు 2,25,000 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని,మిగిలినవి శరవేగంగా పూర్తవుతున్నాయని వివరించారు. రెండవ విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పిన్నపాక గ్రామంలో 79 మంది అర్హులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తున్నామని,వీటిలో ఎస్సీ,బీసీ,మైనారిటీ,ఇతర సోదరీమణులు ఉన్నారని తెలిపారు.డ్వాక్రా మహిళలకు రూ. 70,000 కోట్ల మేర సున్నా వడ్డీ రుణాలు అందించడం జరిగిందని, రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేయడంతో పాటు రైతు భరోసా, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్ (200 యూనిట్ల వరకు), రేషన్ కార్డుల పంపిణీ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రెండున్నర సంవత్సరాల పాలనలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని, పేదల సంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్ల తోపాటు, స్థలాలు లేనివారికి స్థలాల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేశామన్నారు. సర్వే చేసి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూర్చుతామన్నారు.కార్యక్రమంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంతోనే పేదల అభ్యున్నతి,సంక్షేమం సాధ్యమని అన్నారు.రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లను మంజూరు చేశారని తెలిపారు. పిన్నపాక గ్రామానికి మొదటి విడత కింద 25 ఇళ్లను కేటాయించి, ఒక్కో ఇంటికి రూ5 లక్షల సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలను గుర్తించి నేడు 79 మంది అర్హులకు ప్లాట్ల పట్టాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.మహిళలకు అత్యున్నత గౌరవం ఇస్తూ,డిజిటల్ రేషన్ కార్డులను కుటుంబ యజమానులైన మహిళల పేరిటే అందజేస్తున్నామని అన్నారు. ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ . 10 లక్షల ఆరోగ్యశ్రీ, రైతులకు రుణమాఫీ,ధాన్యానికి బోనస్ వంటి పథకాలను ప్రభుత్వం సమర్ధవంతంగా అమలవుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పినపాక గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్దే ప్రధాన ధ్యేయం మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే, మట్టా రాగమయి

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి అక్టోబర్03(ప్రజా జ్యోతి)** మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా,పలు వార్డుల్లో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డా. మట్టా రాగమయి దయానంద్ పాల్గొని శనివారం శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకాపురి కాలనీ 12వ వార్డు, గాంధీనగర్ 14వ వార్డు, గుడిపాడు రోడ్ 1వ వార్డు ప్రాంతాల్లో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,సత్తుపల్లి పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజలు నిత్యం ఎదుర్కొనే రహదారులు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపేలా అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనిఅధికారులను సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, అభ్యర్థనలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ముఖ్యంగా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యలను దశలవారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు.సత్తుపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు, ప్రతి వార్డులో ప్రజలకు మెరుగైన రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు అందించడమే మా లక్ష్యం. అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా కలెక్టర్ దివాకర్ . సబ్ కలెక్టర్ అజయ్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ చైర్మన్ రిహాన కమల్ పాషా,టౌన్ అధ్యక్షులు గాదె చెన్నారావు, మండల పార్టీ కాంగ్రెస్ నాయకులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.